సాక్షి
కృష్ణాజిల్లా

ఆదివారం । 2 । జూన్ । 2024



వెంకటేశ్వరస్వామి సేవలో
జగ్గయ్యపేట అర్బన్: తిరుమలగిరిలో వేంచేసిన శ్రీవెంకటేశ్వరస్వామిని కృష్ణా జిల్లా ప్రిన్సిపల్ జడ్జి అరుణ సారిక శనివారం దర్శించుకున్నారు. స్వామికి ప్రత్యేక పూజలు చేయించారు.



కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు
కోనేరుసెంటర్(మచిలీపట్నం): కృష్ణా యూనివర్సిటీలోని కౌంటింగ్ కేంద్రాన్ని ఏలూరు రేంజ్ ఐజీ జి.పి.అశోక్‌కుమార్ శనివారం సందర్శించారు.

▶ 8లో

గరిష్టం/కనిష్టం
44.8/31.2

	కనిష్టం	గరిష్టం
నందిగామ	31.1	38.9
జగ్గయ్యపేట	30	39
మచిలీపట్నం	30	35
గుడివాడ	30	37

న్యూస్‌రీల్

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఉద్యోగులు విధి నిర్వహణలో అందించే సేవలతోనే వారికి తగిన గుర్తింపు వస్తుందని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని పేర్కొన్నారు. వైద్యశాఖలో విధులు నిర్వహించి ఉద్యోగవిరమణ చేసిన పలువురిని శనివారం ఘనంగా సత్కరించారు. గవర్నర్‌పేటలోని ఐఎంఏ హాలులో ఈ కార్యక్రమం జరిగింది. ఉద్యోగ విరమణ చేసిన ఫిజియోథెరపిస్టు నాగలక్ష్మీదేవి, డెప్యూటీ స్టాటిస్టికల్ అధికారి గోపాలకృష్ణ, డ్రైవర్ కె.ఏడుకొండలును సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాచర్ల సుహాసిని మాట్లాడుతూ.. ఎన్టీఆర్ జిల్లా ఏర్పాటైన తర్వాత జిల్లా కార్యాలయంలో మొదటిగా ఉద్యోగ విరమణలు జరిగాయన్నారు. ఉద్యోగ విరమణ చేసిన వీరి సేవలు యువ ఉద్యోగులకు స్ఫూర్తిదాయకమన్నారు. జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి మాట్లాడుతూ.. ముగ్గురు ఉద్యోగులు తమ సేవలకు గుర్తింపుగా సత్కారం అందుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇందుమతి, డీఎంఓ డాక్టర్ మోతీబాబు, డీపీఎంఓ డాక్టర్ నవీన్, స్టాటిస్టికల్ అధికారి లక్ష్మోజీ తదితరులు పాల్గొన్నారు.

23న స్విమ్మింగ్ జట్ల ఎంపిక

విజయవాడస్పోర్ట్స్: స్విమ్మింగ్ సబ్ జూనియర్, జూనియర్ ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల స్థాయి పోటీలు ఈ నెల 23వ తేదీన విజయవాడ గాంధీనగర్‌లోని సర్ విజ్జి స్విమ్మింగ్ పూల్‌లో జరుగుతాయని ఎన్టీఆర్ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఐ.రమేష్ తెలిపారు. స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఎఫ్ఐ) లో గుర్తింపు పొందిన క్రీడాకారులే ఈ పోటీలకు అర్హులని పేర్కొన్నారు. క్రీడాకారులు ఈ నెల 19వ తేదీ లోపు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీల అనంతరం 23వ తేదీన ఆయా జిల్లా జట్లను ఎంపిక చేస్తామని తెలిపారు. ఎంపికైన జట్లు జూలై 13, 14 తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తాయని వెల్లడించారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బెజవాడ క్రీడాకారులు సత్తా



విజయవాడస్పోర్ట్స్: మే 29 నుంచి 31వ తేదీ వరకు మంగళగిరిలో జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్‌పోటీల్లో విజయవాడ క్రీడాకారులు తరుణ్‌కుమార్, ఆనంద్‌కుమార్ సత్తాచాటారు. సబ్ జూనియర్ 53 కిలోల విభాగంలో తరుణ్‌కుమార్ సిల్వర్ మెడల్, జూనియర్ 90 కిలోల విభాగంలో ఆనంద్‌కుమార్ బ్రాంజ్ మెడల్ సాధించారు. రాష్ట్ర పతకాలు సాధించిన క్రీడాకారులను ఎన్టీఆర్ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి మల్లేశ్వరరావు, రైల్వే ఏఎస్ఐ ఆర్.నాగేశ్వరరావు అభినందించారు.

542 మంది సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న పాలిసెట్ – 2024 కౌన్సెలింగ్ సజావుగా సాగుతోంది. విజయవాడలో ఏర్పాటు చేసిన మూడు కేంద్రాల్లో శనివారం 542 మంది సర్టిఫికెట్లను పరిశీలించామని పాలిసెట్ ఎన్టీఆర్ జిల్లా కో–ఆర్డినేటర్ ఎం.విజయసారథి తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలోని కేంద్రంలో 150 మంది, మాచవరంలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 190 మంది, గుణదల ఆంధ్ర లయోల డిగ్రీ కళాశాలలో 202 మంది సర్టిఫికెట్లను పరిశీలించామని పేర్కొన్నారు.

నేటి కౌన్సెలింగ్ షెడ్యూల్ ఇలా..
పాలిసెట్–2024 కౌన్సెలింగ్‌లో భాగంగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పెషల్ కేటగిరీ అభ్యర్థులైన స్పోర్ట్స్ అండ్ గేమ్స్ విద్యార్థులు 60,001 నుంచి చివరి ర్యాంకు వరకు, ఎన్‌సీసీ విద్యార్థులకు 80,001 నుంచి చివరి ర్యాంకు వరకు సర్టిఫికెట్లను ఆదివారం పరిశీలిస్తామని విజయసారథి తెలిపారు. ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 92,001నుంచి లక్ష లోపు ర్యాంకు వరకు, ఆంధ్ర లయోల డిగ్రీ కళాశాలలో 1,00,001 నుంచి 1,08,000 లోపు ర్యాంకు పొందిన జనరల్ కేటగిరీ విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తామని పేర్కొన్నారు.

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

- కృష్ణా వర్సిటీలో 98 టేబుళ్ల ఏర్పాటు
- 129 రౌండ్లలో కౌంటింగ్ పూర్తి
- తొలి ఫలితం మచిలీపట్నం
- చివరన గన్నవరం, పెనమలూరు
- ఎక్కడ చూసినా ఫలితాలపై చర్చ



ఈవీఎంలు భద్రపరిచిన కృష్ణా యూనివర్సిటీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అకడమిక్ బ్లాక్

సాక్షి, మచిలీపట్నం: సార్వత్రిక సమరం ముగింపు అంకానికి వచ్చేసింది. దేశ వ్యాప్తంగా చివరి దశ ఎన్నికలు శనివారం పూర్తవడంతో తుది ఘట్టం ఓట్ల లెక్కింపు మాత్రమే మిగిలి ఉంది. రాష్ట్రంలో మే నెల 13వ తేదీన నాలుగో విడతలో ఎన్నికలు నిర్వహించారు. జిల్లాలోని మచిలీపట్నం పార్లమెంట్‌తో పాటు ఏడు అసెంబ్లీ స్థానాల ఈవీఎంలను స్థానిక కృష్ణా యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. ఈ నెల నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రెవెన్యూ, పోలీసు యంత్రాంగం పటిష్టమైన భద్రత మధ్య కౌంటింగ్ చేపట్టేందుకు సర్వం సిద్ధం చేశారు. మరో రెండు రోజుల్లో ఎన్నికల ఫలితాలు వెలువడే అవకాశం ఉండటంతో ఉత్కంఠ పెరిగిపోతోంది. ఎక్కడ చూసినా దీనిపైనే చర్చ జరుగుతోంది. మరోవైపు ఫలితాలపై కొందరు కాయ్ రాజా కాయ్ అంటూ బెట్టింగులకు దిగుతున్నారు. కొందరు ఎన్నికల ముందు నుంచే బెట్టింగ్ ఆరంభించగా మరికొందరు పోలింగ్ పూర్తయ్యాక తెరలేపారు.

ఏర్పాట్లు పూర్తి

మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలో 15,39,460 మంది ఓటర్లు ఉన్నారు. వారి కోసం 1,768 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 12,93,935 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్ల చొప్పున ఏడు నియోజకవర్గాలకు 98 టేబుళ్లు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల సంఖ్య ఆధారంగా 129 రౌండ్లలో కౌంటింగ్ నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. సగటు ప్రతి రౌండ్‌లో 11 నుంచి 13 బూత్‌ల ఈవీఎంలు ఉండనున్నాయి. ఇలా ప్రతి రౌండ్‌లో 9 వేల నుంచి 11 వేల ఓట్లను లెక్కించనున్నారు. నమోదు అయిన పోలింగ్, బూత్‌ల సంఖ్య వారిగా సగటున ప్రతి రౌండ్‌లో తొమ్మిది వేల నుంచి 11 వేల ఓట్లు ఉండనున్నాయి.

తొలుత మచిలీపట్నం ఫలితం

జిల్లాలోని నియోజకవర్గాల్లో ఉన్న ఓటర్ల ఆధారంగా 1,768 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటి ఆధారంగా 10 నుంచి 13 కేంద్రాలకు ఒక రౌండ్ చొప్పున ఏర్పాటు చేశారు. ఇందులో అతి తక్కువగా 205 పోలింగ్ కేంద్రాలు ఉన్న మచిలీపట్నంలో 15 రౌంట్లు మాత్రమే ఉండడంతో తొలి ఫలితం ఇదే వెలువడే అవకాశం ఉంది. అత్యధికంగా 306 పోలింగ్ కేంద్రాలు ఉన్న గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాలకు 22 రౌండ్లు ఉండగా వీటి ఫలితాలు ఆలస్యంగా వెలువడనున్నాయి.

సర్వత్రా ఫలితాలపైనే చర్చ

పల్లె నుంచి పట్టణం దాకా ఎక్కడ ఇద్దరు ముగ్గురు కలిసినా ఎన్నికల ఫలితాలపై చర్చిస్తున్నారు. లెక్కింపులో ఏ అభ్యర్థి గెలుసాడు? ఏ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది? అంటూ మాట్లాడుకుంటున్నారు. తుది దశ పోలింగ్ ప్రక్రియ ముగియడంతో సర్వే ఏజెన్సీలు, న్యూస్ చానెళ్ల ఎగ్జిట్ పోల్స్ సర్వే ఫలితాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండడంతో ఫలితాలు మరింత ఉత్కంఠంగా, జనంలో ఆసక్తికరంగా మారాయి.

ఊపందుకున్న బెట్టింగులు

ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్ ఊపందుకుంది. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఒంటరిగా పోటీ చేయగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి బరిలోకి దిగాయి. కాంగ్రెస్ కూడా కూటమితో లోలోపల అవగాహన కుదుర్చుకుందని కార్యకర్తలే చర్చించుకున్నారు. అయితే ప్రధానంగా వైఎస్సార్ సీపీ, టీడీపీ మధ్యే పోటీ నెలకొనగా ప్రజలు కూడా అలాగే చూస్తున్నారు. కొందరు పార్టీల గెలుపోటములపైనే బెట్టింగ్ కాస్తున్నారు. కౌంటింగ్ దగ్గర పడుతుండటం, ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు చక్కర్లు కొట్టడంతో బెట్టింగ్ రాయుళ్ల ఫలితాల 'ట్రెండ్' ఇలా ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికే మచిలీపట్నంతో పాటు గుడివాడ, గన్నవరం, పెనమలూరు, పెడన ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపోటములు, మెజార్టీపై పందెం కాస్తున్నారు. రూ.లక్షకు రెండు లక్షలు.. మూడు లక్షలు అంటూ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. బెట్టింగ్‌కు సిద్ధపడిన వారు బెట్టింగ్ మొత్తాన్ని ఓ మధ్యవర్తి వద్ద ఉంచుతున్నారని సమాచారం. ఫలితాల తర్వాత మధ్యవర్తికి ఐదు నుంచి పది శాతం కమీషన్ ఇస్తారని తెలుస్తోంది.

ఓట్ల లెక్కింపునకు సహకరించండి

- ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుతో ప్రారంభం
- కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి బాలాజీ, ఎస్పీ అస్మీ



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి బాలాజీ, ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ, డీఆర్వో చంద్రశేఖరరావు

చిలకలపూడి(మచిలీపట్నం): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించేలా చర్యలు తీసుకున్నామని కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డి.కె.బాలాజీ తెలిపారు. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కలెక్టరేట్‌లోని మీడియా సెంటరులో శనివారం సాయంత్రం ఎస్పీ అద్నాన్ నయీం అస్మీతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో మచిలీపట్నం పార్లమెంట్, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కార్యక్రమం కృష్ణా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నాలుగో తేదీ ఉదయం ఎనిమిది గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుతో ప్రారంభమవుతుందని తెలిపారు. 8.30 గంటల నుంచి ఈవీఎంల లెక్కింపు జరుగుతుందని పేర్కొన్నారు. కౌంటింగ్ సిబ్బందికి రెండో దశ శిక్షణ ఆదివారం జరుగుతుందన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు
ఓట్ల లెక్కింపు ప్రక్రియలో శాంతి, భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ హెచ్చరించారు. ఎన్నికలకు సంబంధించిన వివాదాల్లో కేసులు నమోదు చేస్తే తీవ్రంగా ఉంటాయని పేర్కొన్నారు. శనివారం సాయంత్రం ఎగ్జిట్ పోల్స్ విడుదల నేపథ్యంలో బందోబస్తును పటిష్టం చేశామన్నారు. వివాదాలు, బెట్టింగ్‌లు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓట్ల లెక్కింపులో ఎటువంటి అనుమానాలు ఉన్నా వివాదాలకు తావులేకుండా రిటర్నింగ్ అధికారులతో మాట్లాడి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఓట్ల లెక్కింపునకు అదనపు పారా మిలటరీ దళాలను జిల్లాకు రప్పించామన్నారు. సెక్షన్ 148, 30 అమలులో ఉన్నందున ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మూడో తేదీ సాయంత్రం ఐదు గంటల నుంచి ఐదో తేదీ ఉదయం వరకు మద్యం షాపులు పనిచేయవని పేర్కొన్నారు. అల్లర్లు సృష్టించే వారిపై నిఘా ఉంచామని, వారిని హౌస్ అరెస్ట్ చేసి వివాదాలకు తావులేకుండా చర్యలు చేపట్టామని వివరించారు. ఈ సమావేశంలో డీఆర్వో కె.చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు

చిలకలపూడి(మచిలీపట్నం): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జూన్ నాలుగో తేదీన సకాలంలో ఫలితాలు ప్రకటించేలా చర్యలు చేపట్టాలని కృష్ణా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డి.కె.బాలాజీ సంబంధిత రిటర్నింగ్ అధికారులకు సూచించారు. తన చాంబర్‌లో శనివారం వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఓట్ల లెక్కింపును పటిష్టంగా నిర్వహించాలని ఆదేశించారు. ర్యాండమైజేషన్ ద్వారా ఆయా నియోజకవర్గాల వారీ లెక్కింపు విధులకు సిబ్బందిని కేటాయించామని తెలిపారు. ఓట్ల లెక్కింపు సిబ్బందికి మచిలీపట్నంలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఆదివారం మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు శిక్షణ ఇస్తామని తెలిపారు. వివిధ పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు, పోలింగ్ ఏజెంట్లకు కూడా శిక్షణ ఇస్తామన్నారు. మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు సిబ్బందికి జెడ్పీ కన్వెన్షన్ హాలు, గన్నవరం నియోజకవర్గానికి కలెక్టరేట్‌లోని సమావేశపు హాలు, గుడివాడ నియోజకవర్గానికి జెడ్పీ సమావేశపు హాలు, పెడన నియోజకవర్గానికి లేడీయాంప్తిల్ జూనియర్ కళాశాల, మచిలీపట్నం నియోజకవర్గానికి నోబుల్ కళాశాల, అవనిగడ్డ నియోజకవర్గానికి చిలకలపూడి పాండురంగ మునిసిపల్ హైస్కూల్, పామర్రు నియోజకవర్గానికి నిర్మల హైస్కూల్, పెనమలూరు నియోజకవర్గానికి నోబుల్ కళాశాలలోని లైబ్రరీ బిల్డింగ్‌లో శిక్షణ ఇస్తామని వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, రిటర్నింగ్ అధికారులు పి.పద్మావతి, ఎం.వాణి, పి.వెంకటరమణ, బాలసుబ్రహ్మణ్యం, బి.శ్రీదేవి పాల్గొన్నారు.

శ్రీ ఆంజనేయం

హనుమజ్జయంతి వేడుకలు ఉమ్మడి కృష్ణా జిల్లాలో శనివారం కనుల పండువగా జరిగాయి. ఆంజనేయ స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. బాపులపాడు మండలంలోని హనుమాన్‌జంక్షన్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయానికి భక్తులు తలివచ్చారు. శ్రీ ఆంజనేయం, అభయాంజనేయం, జై హనుమాన్ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఆలయ ప్రధానార్చకుడు మారేపల్లి సీతారామానుజాచార్యులు, అర్చకులు గొట్టిపాళ్ల శ్రీనివాసాచార్యులు, శృంగారం రామాచార్యులు సప్తనదీ జలాలు, పంచామృతాలు, రకరకాల పండ్లరసాలతో స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం జరిగింది.

–హనుమాన్‌జంక్షన్



ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా స్వామి ప్రతిమ



హనుమాన్‌జంక్షన్‌లో విశేష పూజలు అందుకున్న అభయాంజనేయ స్వామి

ప్రారంభమైన పింఛన్ల పంపిణీ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో శనివారం వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ప్రారంభమైంది. 2,42,856 మంది లబ్ధిదారులు ఉండగా 1,75,500 మందికి వారి బ్యాంకు ఖాతాల్లో నగదును జమ చేశారు. 67,292 మంది ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేయాల్సి ఉండగా తొలి రోజు 55,458 మందికి నగదు పంపిణీచేసి 82.66 శాతం లక్ష్యం పూర్తిచేశారు. జిల్లాలో పింఛన్ల పంపిణీలో పెడన పట్టణం, మచిలీపట్నం మండలం, పెడన మండలం వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచాయని డీఆర్డీఏ ఇన్‌చార్జ్ పీడీ నాగేశ్వరనాయక్ తెలిపారు.

కేయూ పీజీ పరీక్ష ఫలితాలు విడుదల

కోనేరుసెంటర్(మచిలీపట్నం): కృష్ణా విశ్వవిద్యాలయం పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను ఉపకులపతి ఆచార్య జి.జ్ఞానమణి శనివారం విడుదల చేశారు. విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో 829 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలురాయగా 705 మంది ఉత్తీర్ణులయ్యారు. 85.04 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 152 మంది సప్లిమెంటరీ పరీక్షలు రాయగా 69.54 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. రిజిస్ట్రార్ ఆచార్య శోభన్‌బాబు పరీక్షల నియంత్రణ అధికారి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

'సీపెట్' దరఖాస్తులకు నేటి వరకు గడువు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సీపెట్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోడానికి ఆదివారం వరకే గడువు ఉందని సంస్థ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్.శేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు సంవత్సరాల వ్యవధి గల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ, డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రెండు సంవత్సరాల వ్యవధి గల పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెస్సింగ్ అండ్ టెస్టింగ్ కోర్సుకు బీఎస్సీ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. సీపెట్ అడ్మిషన్ టెస్ట్ జూన్ తొమ్మిదిన విజయవాడ, అనంతపురంలో జరుగుతుందని తెలిపారు. వివరాల కోసం 63001 47965 సెల్‌నంబరులో సంప్రదించాలని కోరారు.

పిల్లల్లోనూ కిడ్నీ సమస్యలు

- గుర్తించకుంటే ప్రమాదమే
- నెఫ్రాటిక్ సిండ్రోమ్‌ను అశ్రద్ధ చేయొద్దు
- లక్షణాలను గుర్తించాలని వైద్యుల సూచన



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఇటీవల కిడ్నీ వ్యాధి పీడితులు అధికమవుతున్నారు. పెద్దలకే పరిమితమైన కిడ్నీ సమస్యలు ఇప్పుడు పిల్లల్లోనూ వెంటాడుతున్నాయి. ఇటీవల పిల్లల్లో కూడా కిడ్నీ వ్యాధులను వైద్యులు గుర్తిస్తున్నారు. మూత్రంలో ప్రొటీన్లు పోవడం అనే నెఫ్రాటిక్ సిండ్రోమ్ పిల్లల్లో కనిపిస్తోంది. తీసుకునే ఆహారంలోని ప్రొటీన్లు శరీరం ఎదుగుదలకు సక్రమంగా పనిచేయడానికి ప్రధానమైనవి. కొందరు చిన్నారుల్లో ప్రొటీన్లు మూత్రం ద్వారా పోతున్నాయి. దీంతో శరీరంలోని ప్రొటీన్ల శాతం తగ్గి, ఇతర భాగాల్లో నీరు చేరి వాపు వస్తుంది. సాధారణంగా రెండు నుంచి ఎనిమిదేళ్ల మధ్య వారిలో నెఫ్రాటిక్ సిండ్రోమ్ కనిపిస్తుంది. చాలా అరుదుగా పుట్టుక నుంచి ఏ వయస్సు వారికైనా సోకవచ్చని వైద్యులు చెబుతున్నారు. అయితే దీనికి కచ్చితమైన కారణం లేదని, మనం వినియోగించే కొన్ని రకాల మందులు, రసాయనాలతో వచ్చే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు.

ఆహార నియమాలు ఇవీ..
చికిత్స తీసుకుంటున్నప్పుడు పరిమిత స్థాయిలో ఉప్పు తీసుకోవడం, పూర్తిగా మానేయడం మంచిది. చిప్స్, పచ్చళ్లు, అప్పడాలు వంటివి తినకూడదు. వీలైతే తక్కువ మోతాదులో పప్పులో, ఆకుకూరల్లో ఉప్పు వాడవచ్చు. తీసుకునే ఉప్పును బట్టి పిల్లల్లో శరీరంలో వాపును అరికట్టవచ్చు.

చికిత్స ఇలా..
- నెఫ్రాటిక్ సిండ్రోమ్‌ను గుర్తించిన తర్వాత స్టెరాయిడ్ థెరపీ ద్వారా చికిత్స చేస్తారు. ఇది మూడు అంచెలుగా నాలుగు నెలల వ్యవధిలో అందిస్తారు.
- మొదటిగా ప్రెడ్నిసోలోన్–ప్రైసోలోన్–ఓమ్నీకార్ట్ అనే మందు రోజూ నాలుగు నుంచి ఆరు వారాలు ఇస్తారు. ఆ తర్వాత సింగిల్ డోస్‌గా మరో నాలుగు నుంచి 12 వారాలు వాడాల్సి ఉంటుంది.
- సాధారణంగా మూడు నాలుగు వారాల్లో పిల్లల్లో ఫలితాలు కనపడతాయని వైద్యులు చెపుతున్నారు. వ్యాధి తిరిగి రాకుండా చికిత్స తీసుకోవాలి.

లక్షణాలు ఇవీ..

- శరీర భాగాల్లో వాపు ఉంటే నెఫ్రాటిక్ సిండ్రోమ్‌గా అనుమానించవచ్చు.
- ఉదయం వేళ పిల్లలు నిద్రలేచిన వెంటనే కంటి భాగంలో వాపు కనిపించి సాయంత్రానికి తగ్గి, ఇతర భాగాలకు(కాళ్లకు) సోకుతుంది.
- నిర్ధారణ పరీక్షల్లో.. రక్తంలో ఉన్న ప్రొటీన్లు కంటే, మూత్రంలో ఉన్న ప్రొటీన్లు ఎక్కువగా ఉంటే వ్యాధిగా గుర్తిస్తారు.
- నెఫ్రాటిక్ సిండ్రోమ్ సోకితే జ్వరం, దీర్ఘకాలిక దగ్గు, జలుబు, మత్తు, కడుపు నొప్పి, కాళ్ల వాపులు, ముఖం వాపు ఉంటుంది.

తగ్గుతున్న వ్యాధి నిరోధకశక్తి

మూత్ర విసర్జనలో ప్రొటీన్లు పోవడం, స్టెరాయిడ్స్ వాడటంతో రోగ నిరోధకశక్తి క్షీణిస్తుంది. దీంతో ఈ వ్యాధి పీడితులకు త్వరగా ఇన్‌ఫెక్షన్స్ సోకవచ్చు. సాధారణంగా కడుపులో, చర్మంపై, ఊపిరితిత్తుల్లో, మూత్ర సంబంధ వ్యాధులు సంభవిస్తాయి. చాలా అరుదుగా రక్తకణాల్లో గడ్డలు కడతాయి.

చిన్నారుల్లో నెఫ్రాటిక్ సిండ్రోమ్



ఇటీవల చిన్నారుల్లో నెఫ్రాటిక్ సిండ్రోమ్‌ను చూస్తున్నాం. వారికి స్టెరాయిడ్స్ థెరపీ చేస్తున్నాం. వ్యాధి సోకినా చాలా వరకూ పిల్లలు బాగానే ఉంటారు. 65 శాతం పిల్లల్లో ఒకటి అంతకంటే ఎక్కువ సార్లు గొంతులో వచ్చే ఇన్‌ఫెక్షన్ కారణంగా మళ్లీ వాపు రావచ్చు. వారికి స్టెరాయిడ్ చికిత్సతో డోసు, కాలం తగ్గించి వ్యాధి నయం చేస్తాం. కొందరికి స్టెరాయిడ్స్ థెరపీ చేసినా లొంగక పోవచ్చు. అప్పుడు కిడ్నీ బయాప్సీ చేసి, వేరే మందులతో చికిత్స అందిస్తాం.

– డాక్టర్ భీమవరపు భార్గవ్, మూత్రపిండ వ్యాధుల నిపుణులు

అశ్రద్ధ చేయకూడదు



పిల్లల్లో నెఫ్రాటిక్ సిండ్రోమ్ సమస్యను చాలా సాధారణంగా చూస్తున్నాం. ఇది వచ్చిన వారికి తొలుత మందులు వాడతాం. సమస్య జటిలమైతే నెఫ్రాలజిస్టు వద్దకు పంపుతాం. తగ్గని జ్వరం, కాళ్లు, ముఖం వాపులు, యూరిన్‌లో ప్రొటీన్లు పోవడం వంటివి ఈ వ్యాధి ముఖ్య లక్షణాలు. దీనికి మందులు వాడకుండా అశ్రద్ధ చేయకూడదు. నిపుణులైన వైద్యుల వద్దకు వెళ్లి అవసరమైన చికిత్స పొందాలి.

– డాక్టర్ ఎస్ఎస్ విఠల్‌రావు, పిడియాట్రీషియన్, రిటైర్డ్ ప్రిన్సిపాల్, సిద్ధార్థ వైద్య కళాశాల

అబ్జర్వర్ల నియామకం

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో ఓట్ల కౌంటింగ్ ప్రక్రియ పర్యవేక్షించేందుకు ఎన్నికల కమిషన్ పరిశీలకులను నియమించింది. గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గానికి చిదానంద ఎస్ఎస్, గుడివాడ నియోజకవర్గానికి బన్సీలాల్ రాణా, పెడన నియోజకవర్గానికి అనిల్ చంద్ర డియోరి, మచిలీపట్నం నియోజకవర్గానికి జాన్ కింగ్స్ లే, అవనిగడ్డ నియోజకవర్గానికి అఖిలేష్ కుమార్ సింగ్, పామర్రు (ఎస్సీ) నియోజకవర్గానికి రాజీవ్ దత్త, పెనమలూరు నియోజకవర్గానికి అభిజిత్ బోస్‌లను నియమించారు.

వైభవంగా వీరాంజనేయస్వామి జన్మదినోత్సవం



గంపలగూడెం నుంచి మేడూరుకు పాదయాత్రగా వెళుతున్న రామసేవకులు

మేడూరు(గంపలగూడెం): ఎన్టీఆర్ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గంపలగూడెం మండలం మేడూరు శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో స్వామి జన్మదినోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. జైహనుమాన్, జైశ్రీరామ్ అంటూ పెద్దసంఖ్యలో భక్తులు స్వామిని వేనోళ్ల స్మరిస్తుండగా ఆలయ అర్చకులు కోమండూరి రామచంద్రాచార్యులు ఆధ్వర్యంలో గణపతిపూజతో ప్రత్యేక పూజలు ప్రారంభించారు. స్వామికి పంచామృతాలు, నవఫల రసాలు, 108 కలశ బిందెల జలంతో స్వామికి అభిషేకం కనులవిందుగా చేశారు. స్వామికి విశేష అలంకరణ చేసి తమలపాకులు, సింధూరంతో పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా పాల్గొనటంతో తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఆలయంలో రద్దీ ఏర్పడింది. మధ్యాహ్నం భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. ఆలయ మేనేజర్ జన్ను వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో సిబ్బంది తగిన ఏర్పాట్లు చేశారు. రామసేవకులు, హనుమత్ భక్తబృందంచే గంపలగూడెం రామాలయం నుంచి మేడూరు వీరాంజనేయస్వామి ఆల యం వరకు భక్తులు ఆరు కిలోమీటర్ల దూరం పాదయాత్ర నిర్వహించారు. భక్తులు ఆంజనేయస్వామి జెండాలను చేతబూని జైహనుమాన్, జైశ్రీరామ్ అంటూ పాదయాత్రలో పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

షిరిడీ సాయిబాబా భక్తుల దర్శన సౌకర్యాలకు కృషి

పామర్రు: మహారాష్ట్రలోని షిరిడీ సాయి మందిర్ అభివృద్ధికి, భక్తుల దర్శన సౌకర్యాల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని ఆ రాష్ట్ర ప్రభుత్వంచే నియమితులైన శ్రీసాయి మందిర్ సంస్థాన్ కమిటీ ఇన్‌చార్జి చైర్మన్, అహ్మద్ నగర్ జిల్లా న్యాయస్థాన ప్రిన్సిపల్ జడ్జి అయిన యార్లగడ్డ సుధాకర్ తెలిపారు. ఆయన స్వగ్రామం రావివారిపాలెం వెళ్లి వస్తూ మార్గ మధ్యలో పామర్రులోని వారి బంధువుల ఇంట్లో కార్యక్రమానికి శనివారం ఆయన విచ్చేశారు. కృష్ణా జిల్లా మోపిదేవి మండలం రావివారిపాలెం గ్రామానికి చెందిన సుధాకర్ అహ్మద్ నగర్ జిల్లా కోర్టు ప్రిన్సిపల్ జడ్జిగా ఉన్నారు. దీంతో ఆ జిల్లా పరిధిలోనే షిరిడీ సాయి మందిరం ఉండటంతో ప్రభుత్వం నియమించే కమిటీకి కో ఆప్టెడ్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తి పారదర్శకంగా నిబంధనలకు లోబడి సాయి సంస్థాన్ కమిటీ పని చేస్తుందని చెప్పారు. భక్తుల దర్శన సౌకర్యాలలో దళారీ వ్యవస్థను రూపుమాపామని పేర్కొన్నారు. తెలుగు వాడినైన తాను షిర్డిలో సాయి గుడికి ఇన్‌చార్జి చైర్మన్‌గా పనిచేస్తున్నప్పటికీ ప్రాంతీయ భేదం లేకుండా సేవలు అందించటమే ధ్యేయం అని వెల్లడించారు.

బాలికపై లైంగికదాడి

మక్కపేట(వత్సవాయి): బాలికపై అత్యాచారం చేసిన ఘటనలో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ బి.అభిమన్యు శనివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం అద్దిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన రేపూరి గోపాలం మండలంలోని మక్కపేట గ్రామానికి వ్యవసాయ పనుల నిమిత్తం ఏడేళ్ల క్రితం వచ్చి నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో గోపాలం అద్దెకు ఉంటున్న ఇంటి పక్కనే బాలికను మాయ మాటలతో నమ్మబలికి అత్యాచారం చేశాడు. ఈ విషయాన్ని ఎవరికన్నా చెబితే నిన్ను మీ తల్లిదండ్రులను చంపుతానని బెదిరించాడన్నారు. బాలికకు కడుపులో నొప్పిగా ఉందని చెప్పడంతో వారు వైద్యుల వద్దకు తీసుకువెళ్లగా విషయం బయట పడింది. దీంతో కుటుంబసభ్యులు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు నిందితుడు గోపాలంను అరెస్టు చేశారు. కేసు విచారణ చేస్తున్నారు.

కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు

- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు
- అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్‌లకు మాత్రమే అనుమతి
- కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లే వారికి బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షలు తప్పనిసరి
- పోలీసు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే క్రిమినల్ కేసులు
- జిల్లా ఎస్పీతో కలిసి కౌంటింగ్ కేంద్రం పరిశీలించిన ఐజీపీ అశోక్‌కుమార్



కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రతను పరిశీలిస్తున్న ఐజీపీ అశోక్‌కుమార్, చిత్రంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి

కోనేరుసెంటర్:జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఏలూరు రేంజ్ ఐజీపీ జీవీ అశోక్‌కుమార్ కోరారు. కౌంటింగ్ రోజు ఎవరైనా అల్లర్లు, అలజడులు సృష్టిస్తే కచ్చితంగా పోలీసు చర్యలు ఉంటాయని క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు వెనకాడేదిలేదని స్పష్టం చేశారు. శనివారం ఆయన జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మితో కలిసి కృష్ణా విశ్వవిద్యాలయంలోని కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించి అక్కడి ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. బందోబస్తు, మూడంచెల భద్రతా ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, కౌంటింగ్ సిబ్బంది రాకపోకల కోసం ఏర్పాటుచేసిన దారులను పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆ రోజు ప్రజాప్రతినిధులు, ప్రజలు ఎవ్వరూ కూడా గుంపులుగా ఉండకూడదన్నారు. అటువంటి దృశ్యాలు కనబడితే తమ సిబ్బంది తక్షణమే తగిన చర్యలు తీసుకుంటారని చెప్పారు. 144 సెక్షన్‌తో పాటు పోలీస్ 30 యాక్ట్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. కౌంటింగ్ కేంద్రానికి అర్హులైన వారిని మాత్రమే లోనికి అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఎవ్వరు పడితే వారు లోనికి వెళ్లడానికి వీలు ఉండదన్నారు. ఎవరైనా సరే సంబంధిత ఎంట్రీ పాస్ చూపించి లోనికి వెళ్లాల్సి ఉంటుందన్నారు. నిబంధనలకు కట్టుబడి అందరూ పోలీసులకు సహకరించాలన్నారు. లేనిపక్షంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు.



ఫలితాలను విడుదల చేసేందుకు ఏర్పాటు చేసిన స్క్రీన్ డిస్ప్లేలను పరిశీలిస్తున్న దృశ్యం

రెండు కిలోమీటర్ల మేర రెడ్‌జోన్....

కౌంటింగ్ రోజున కృష్ణా విశ్వవిద్యాలయంకు రెండు కిలోమీటర్‌ల మేర రెడ్‌జోన్‌గా ప్రకటించటం జరిగిందన్నారు. కౌంటింగ్ రోజున డ్రోన్‌లు, వీడియో కెమెరాలను వినియోగించకూడదన్నారు. చట్టానికి వ్యతిరేకంగా ఎవరైనా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాంటి చర్యలకు పాల్పడే వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కెమెరాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అలాగే కౌంటింగ్ కేంద్రాన్ని నో స్మోకింగ్, నో ఆల్కహాల్ జోన్‌గా పరిగణించినట్లు చెప్పారు. కౌంటింగ్ కేంద్రం వద్దకు వచ్చే ప్రతి ఒక్కరినీ బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షలు చేసిన అనంతరం లోపలకు అనుమతిస్తామని స్పష్టం చేశారు. మద్యం సేవించినట్లు తేలితే నిర్మొహమాటంగా వెనక్కి పంపిస్తామన్నారు.

అప్రమత్తంగా పోలీసు సిబ్బంది...

ఎన్నికలకు సంబంధించిన ఎగ్జిట్ పోల్ రానున్న నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందుకు అవసరమైన సిబ్బందిని ఇప్పటికే సిద్ధం చేసినట్లు చెప్పారు. జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర సాయుధ బలగాలతో పికెట్ ఏర్పాటుచేశామన్నారు. ఎక్కడా కూడా అల్లర్లు, అలజడులకు తావు లేకుండా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఎవరైనా అలాంటి చర్యలకు పాల్పడితే సహించేదిలేదన్నారు. ఎవరైనా హింసాత్మక చర్యలకు పూనుకుంటే చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో బందరు డీఎస్పీ మహమ్మద్ సుభాన్, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ సోనూకు ఏపీసీఈఐ అవార్డు



ఇబ్రహీంపట్నం:ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ ఈవెంట్ ఇండస్ట్రీ అవార్డు ఇబ్రహీంపట్నంకు చెందిన స్నాప్లికా ఫొటోగ్రఫీ అధినేత సోను దక్కించుకున్నాడు. నోవాటెల్ హోటల్లో శనివారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఏపీసీఈఐ వ్యవస్థాపక అధ్యక్షులు జయశంకర్, రెడ్ చారిటీస్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ ఉపాధ్యక్షుడు వినోద్‌గోపాల్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు. ఏపీసీఈఐ సంస్థ ఏటా ఫొటోగ్రఫీ, ఈవెంట్ మేనేజ్‌మెంట్, డ్యాన్స్, కల్చరల్ వంటి ఈవెంట్‌లు నిర్వహించి అవార్డులు అందిస్తుంది. 2024 ఏడాదికి గాను స్నాప్లికా ఫొటోగ్రఫీ ఆధ్వర్యంలో సోను రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో ప్రతిష్టాత్మకమైన ఫొటోలు, సమాజానికి ఉపయోగపడే సందేశాత్మక ఫొటోగ్రఫీతో అవార్డు దక్కించుకున్నాడు. 2023లో టైమ్స్ ఆఫ్ ఇండియా సంస్థ ఎక్సలెన్స్ అవార్డు సైతం సోను పొందాడు.

విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు

జిల్లా ఎస్పీ అద్నాన్ నయీంఅస్మీ



మీడియాతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ నయీంఅస్మీ, పక్కన డీఎస్పీ శ్రీకాంత్

గుడివాడరూరల్: కౌంటింగ్ సందర్భంగా జిల్లాలో ఎటువంటి ఘర్షణలు తలెత్తకుండా పోలీస్‌శాఖ అన్ని చర్యలు చేపట్టిందని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీంఅస్మీ తెలిపారు. గుడివాడ నెహ్రూచౌక్‌లో శనివారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. గుడివాడ నియోజకవర్గంలో ఒకటి, రెండు చోట్ల మినహా మిగిలిన అన్ని చోట్లా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగిందని చెప్పారు. అదే విధంగా కౌంటింగ్ రోజున కూడా గొడవలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని డీఎస్పీ పి.శ్రీకాంత్‌కు సూచించారు. ఓట్ల లెక్కింపు ముగిసిన తర్వాత విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు, బాణసంచా కాల్చడం తదితర వాటికి ఎటువంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. ఇలాంటివి చేయకుండా ఉండేందుకు రాజకీయ పార్టీల నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఎవరైనా ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్‌తోపాటు 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందన్నారు. ప్రస్తుతం జిల్లా మొత్తం ప్రశాంతమైన వాతావరణంలో ఉందని, ఘర్షణలు ఏర్పడే రెండు, మూడు ప్రాంతాలను తాము గుర్తించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని వెల్లడించారు. అదే విధంగా 133 చోట్ల పోలీసు పికెట్‌లను నెలకొల్పామని వివరించారు. శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కల్గించేలా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ, టీడీపీ కార్యాలయాలను పరిశీలించారు. సమావేశంలో డీఎస్పీ పి.శ్రీకాంత్, సీఐలు కె.ఇంద్ర శ్రీనివాస్, ఎంవీ దుర్గారావు, కె.ఏసుబాబు, ఎస్ఐలు గౌతమ్‌కుమార్, శ్రీనివాసరావు, నాగరాజు, ఎల్ఎస్ఎన్ మూర్తి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.